# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 24-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:162 పేజీలు:6 వెల: రూ.1/-

## పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీలు.. పలువురికి పదోన్నతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీలు అవగా.. పలువురికి పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ప్రభుత్వ సీఎస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇరిగేషన్ స్పెషల్ సెక్రెటరీగా ప్రశాంత్ పాటిల్, జనగాం కలెక్టర్‌గా రిజ్వన్ భాష షేక్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. సిద్దిపేట కలెక్టర్‌గా మను చౌదరి ఐఏఎస్ నియమితులయ్యారు. అలాగే జనగాం కలెక్టర్ శివలింగయ్యపై వేటు పడింది. జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శైలజా రామయ్యార్ ఐఏఎస్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## 27 నుంచి ఉచిత విద్యుత్, గ్యాస్ పథకాలు అమలు .. రేవంత్ రెడ్డి..




మేడారం ఫిబ్రవరి 23: ఈ నెల 27 వ తేదీ సాయంత్రం రెండు గ్యారెంటీలు ప్రారంభించనున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు.. మేడారంలో ఆయన మీడియాలో మాట్లాడుతూ, సమ్మక్క సారక్కలంటేనే పోరాట స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అమరులై దేవతలుగా వెలిసారని చెప్పారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవతలను కోరుకున్నానని తెలిపారు. మేడారం మహా జాతర సమ్మక్క సారలమ్మ పండుగ సంధర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి అమ్మవారికి నిలువెత్తు బంగారం (బెల్లం), పసుపు కుంకుమ, గాజులు, సమర్పించారు.

తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ మురళి నాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, జాతర ప్రత్యేక అధికారులు శరత్, ఆర్వీ కర్ణన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరిష్ తదితరులు ఉన్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమైన ఏ కార్యక్రమం తీసుకున్న ఇక్కడి నుంచే మొదలు పెట్టామని చెప్పారు. హాత్ సే హాత్ జోడో యాత్ర ఇక్కడి నుంచే ప్రారంభించామని అన్నారు. ఇక రూ 500 లకే పేద మహిళలకు గ్యాస్ సిలిండర్ , 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను ఆ రోజు నుంచి అమలు చేయనున్నట్లు చెప్పారు..ఈ రెండు గ్యారెంటీలు ప్రారంభానికి ముఖ్య అతిధిగా హాజరవుతున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరవుతున్నట్లు వెల్లడించారు..

సమక్క సారక్క దీవెనలతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. యాత్ర సమయంలో ఎలాంటి ఆకంటం లేకుండా జాతర జర్పిస్తామని మాట ఇచ్చామని మాట ప్రకారం జాతర కోసం రూ. 110 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేశామని తెలిపారు.

జాతరకు వచ్చేందుకు 6 వేల బస్సులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. 18 కోట్ల ఉచిత ఆర్టీసీ టికెట్లు వాడారని చెప్పారు. ఎన్నో వడిదుడుకులు ఎదురుకుని నిలబడ్డామని అందుకే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు.

ప్రజా పాలన ప్రజలకు చేరువైతుందని నమ్మకం కల్పించామని తెలిపారు. జాతరకు కోటిన్నరకు పైగా భక్తులు వస్తే ఈ పండుగను జాతీయ పండుగగా మార్చమని కేంద్రాన్ని కోరామని కానీ అందుకు కేంద్రం స్పందించలేదని చెప్పారు.

## సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న గవర్నర్ తమిళిసై కేంద్ర మంత్రి అర్జున్ ముండా



మేడారం, ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మేడారం సమక్క - సారమ్మ మహా జాతర వైభవంగా జరుగుతోంది. ఇప్పటికే పెద్దసంఖ్యలో భక్తులు మేడారంకు చేరుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, కేంద్ర మంత్రి అర్జున్ ముండా మేడారం చేరుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్, కేంద్రమంత్రి నిలువెత్తు బంగారం సమర్పించి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమిళిసై, అర్జున్ ముండా వనదేవతలను దర్శించుకున్నారు.

### ఇది గొప్ప జాతర: గవర్నర్

దర్శనానంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సమ్మక్క సారలమ్మను కోరానని తెలిపారు. ఇది గొప్ప జాతర అని కొనియాడారు. లక్షల కొద్దీ ప్రజలు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారని తెలిపారు. "నేను గవర్నర్‌గా మూడోసారి మేడారం జాతరకు రావడం నా అదృష్టం" అని గవర్నర్ తమిళిసై హర్షం వ్యక్తం చేశారు.

### ఆనందంగా ఉంది: అర్జున్ ముండా

ఇది దేశంలోనే అతిపెద్ద ఆదివాసి జాతర అని కేంద్రమంత్రి అర్జున్ ముండా అన్నారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారన్నారు. సమ్మక్క సారలమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందని కేంద్రమంత్రి అన్నారు.కాగా.. సమ్మక్క–సారలమ్మల నామస్మరణతో మేడారం మహా జాతర ప్రాంగణం మార్మోగుతోంది. అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ఎత్తు బంగారాలను భక్తులు సమర్పిస్తున్నారు. ఇప్పటికే గద్దెలపైకి సమక్క సారలమ్మలు చేరుకోవడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈనెల 21 నుంచి జాతర ప్రారంభమవగా.. నాలుగు రోజుల పాటు వనదేవతల జాతర జరుగనుంది.

## సీటు బెల్ట్ పెట్టుకోకపోవడంతోనే ఎముకలు విరిగి లాస్య మరణం ..





హైదరాబాద్, ఫిబ్రవరి 23: సికింద్రాబాద్ కంటోన్మెంట్ భారాస ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతికి సంబంధించిన వివరాలను గాంధీ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలైనట్లు పోస్టుమార్టం పూర్తిచేసిన అనంతరం వైద్యులు మీడియాకు తెలిపారు. లాస్య నందిత దవడ ఎముక విరిగిందని.. ఎడమ కాలు ఎముక, ఛాతీ ఎముకలు సైతం విరిగాయని పేర్కొన్నారు. ఆమె సీట్లు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్లే ఆమెకు బలమైన గాయాలు తగిలి ప్రాణాలు పోయాయని వెల్లడించారు..లాస్య తప్ప ఆమె కుటుంబ సభ్యులు గురువారం రాత్రి సదాశివపేట (మం) కొనాపూర్‌లోని మిస్కిన్ బాబా దర్గాకి వచ్చారు. కాసేపటికే ఆకాష్‌తో పాటు లాస్య కూడా దర్గాకి వచ్చారు. లాస్య కుటుంబం అంతా రాత్రి 12.30 గంటలకు దర్గాలో పూజలు చేశారని అక్కడి నిర్వాహకులు చెబుతున్నారు. తిరిగి.. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో హైదరాబాద్‌కు లాస్య కుటుంబం పయనం అయ్యింది. మొక్కులు తీర్చుకున్న తర్వాత.. 3 నుంచి 4 గంటల మధ్య లాస్య బయల్దేరిందని చెప్తున్నారు.

### పూర్తిస్థాయి విచారణ తర్వాతే..

సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్ వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే కారు ప్రమాదానికి గురైంది. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి ఏఎస్పీ సంజీవ రావు, ఆర్డీవ రామారావు పరిశీలించారు. ఏఎస్పీ సంజీవరావు మీడియాతో మాట్లాడుతూ.. ఉదయం 5:30 గంటలకు ప్రమాదం జరిగినట్టు పోలీసులకు సమాచారం అందింది. కారు శకలాలు 100 మీటర్ల దూరంలో పడి ఉన్నాయి. రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో ఆమె ప్రయాణించిన కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అక్కడికక్కడే ఎమ్మెల్యే లాస్యనందిత మృతి చెందారు. మరో వ్యక్తి ఆకాష్ మియపూర్ లో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేసి వివరాలు వెల్లడిస్తాం అని అన్నారాయన. . డ్రైవర్ నిద్రమత్తు, వేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

## లాస్య నందిత భౌతికకాయానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళి..



హైదరాబాద్, ఫిబ్రవరి 23:రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందితకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు.

సికింద్రాబాద్ కార్ఖానాలోని ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు సీఎం వెంట ఉన్నారు.

పటాన్‌చెరు సమీపంలో ఓఆర్ఆర్‌పై కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లాస్య నందిత అక్కడికక్కడే మృతి చెందింది. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. నందిత మృతితో కుటుంబ సభ్యులు, అభిమానులు, అనుచరులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## లాస్య కుటుంబానికి కెసిఆర్ పరామర్శ..



హైదరాబాద్, ఫిబ్రవరి 23:రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత భౌతికకాయానికి మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ నివాళులు అర్పించారు. సికింద్రాబాద్ కార్ఖానాలోని ఆమె నివాసానికి వెళ్లిన కేసీఆర్.. ఎమ్మెల్యే కుటుంబసభ్యులను పరామర్శించారు. కేసీఆర్ వెంట హరీశ్‌రావు, తలసాని తదితరులు ఉన్నారు.

## బీహార్11 ఎమ్మెల్సీ సీట్లకు మోగింది ఎన్నికల నగరా

పాట్నా ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బీహార్ ఎమ్మెల్సీ ఎన్నికల నగరా మోగింది.

11 సీట్లకు జరగాల్సిన ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ శుక్రవారంనాడు ప్రకటించింది. వీటిలో నితీష్ కుమార్ సీటు కూడా ఉండటం విశేషం. మరో రెండు నెలల్లో ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. మే 6వ తేదీతో పదవీకాలం ముగియనున్న వారిలో మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి (ఆర్జేడీ), ఆ పార్టీ నేత రామ్ చంద్ర పూర్వే కూడా ఉన్నారు.తాజా షెడ్యూల్ ప్రకారం 11 సీట్లకు ఎన్నికల నోటిఫికేషన్ మార్చి 4న వెలువడనుంది. మార్చి 11వ తేదీతో నామినేషన్ల దాఖలు గడువు ముగుస్తుంది.

మార్చి 14 వరకూ నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. మార్చి 21న పోలింగ్ నిర్వహించ నుండగా, అదే రోజు సాయంత్రమే ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

మార్చి 23వ తేదీలోగా ఎన్నికల ప్రక్రియ ముగియాల్సి ఉంది. కాగా, ప్రస్తుతం ఎన్నికలు జరగాల్సి ఉన్న 11 స్థానాల్లో 3 సీట్లకు బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తోంది. కాంగ్రెస్ ఒక సీటుకు ప్రాతినిధి వహిస్తోంది. జేడీయూకు సింహభాగం ఉంది.

నితీష్ కుమార్‌తో పాటు ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన సంజయ్ కుమార్ ఝా పదవీకాలం కూడా ముగియనుంది. జేడీయూ ఎమ్మెల్యేలు ఖలీద్ అన్వర్, రామేశ్వర్ మెహతో పాటు హెచ్ఏఎం వ్యవస్థాపకుడు జితిన్ రమ్ మాంఝీ తనయుడైన సంతోష్ సుమన్ పదవీకాలం కూడా ముగియనుంది.

## వారణాసి బి హెచ్ యు లోని స్వతంత్ర సభగర్‌లో జరిగిన సంసద్ సంస్కృత ప్రతియోగిత బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు వారణాసిలోని బి హెచ్ యు లో స్వతంత్ర సభగర్ లో జరిగిన సంసద్ సంస్కృత ప్రతియోగిత బహుమతి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాశీ సంసద్ ప్రతియోగిత బుక్ లెట్ ను, కాఫీ టేబుల్ బుక్ ను ఆయన ఆవిష్కరించారు. కాశీ సంసద్ జ్ఞాన్ ప్రతియోగిత, కాశీ సంసద్ ఫోటోగ్రఫీ ప్రతియోగిత, కాశీ సంసద్ సంస్కృత ప్రతియోగిత విజేతలకు, వారణాసిలోని సంస్కృత విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం సెట్లు, సంగీత వాయిద్యాలు, మెరిట్ స్కాలర్ షిప్ లను ప్రధాన మంత్రి ప్రదానం చేశారు. కాశీ సంసద్ ఫొటోగ్రఫీ ప్రతియోగిత గ్యాలరీని సందర్శించిన ఆయన 'సన్వర్తి కాశీ' థీమ్ పై ఫొటో ఎంట్రీలతో పాల్గొన్న వారితో ముచ్చటించారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ యువ విద్వాంసుల మధ్య ఉన్నందుకు సంతోషం వ్యక్తం చేసి, ఇది జ్ఞాన గంగలో స్నానం చేసిన అనుభూతి లాంటిదని అన్నారు. పురాతన నగరం గుర్తింపును బలోపేతం చేస్తున్న యువత కృషిని ఆయన కొనియాడారు. భారత యువత అమృత్ కాల్ లో దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడం గర్వకారణమని ఆయన అన్నారు. "కాశీ నిత్య జ్ఞానానికి రాజధాని" అని ప్రధాన మంత్రి అన్నారు, కాశీ సామర్థ్యాలు, స్వరూపం తిరిగి పూర్వ వైభవాన్ని పొందడం యావత్ దేశానికి గర్వకారణమని నొక్కి చెప్పారు. కాశీ సంసద్ జ్ఞాన్ ప్రతియోగిత, కాశీ సంసద్ ఫోటోగ్రఫీ ప్రతియోగిత, కాశీ సంసద్ సంస్కృత ప్రతియోగిత అవార్డులను ప్రదానం చేసి విజేతలను అభినందించారు. విజేతల జాబితాలో చోటు దక్కించుకోలేకపోయిన వారిని ప్రోత్సహించారు. "పాల్గొన్న వారెవరూ ఓడిపోలేదు లేదా వెనుకబడలేదు, బదులుగా, ప్రతి ఒక్కరూ ఈ అనుభవం నుండి నేర్చుకున్నారు" అని ప్రధాన మంత్రి అన్నారు, పాల్గొన్న వారందరూ ప్రశంసనీయులేనని పేర్కొన్నారు. కాశీ ఎంపీగా తన దార్శనికతను ముందుకు తీసుకెళ్లినందుకు శ్రీ కాశీ విశ్వనాథ్ మందిర న్యాస్, కాశీ విద్వత్ పరిషత్, పండితులకు ప్రధాన మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోజు విడుదల చేసిన కాఫీ టేబుల్ పుస్తకాల్లో గత పదేళ్లలో కాశీ పునరుజ్జీవనం గురించిన కథ ఉందని ఆయన పేర్కొన్నారు.

గత పదేళ్లలో కాశీ సాధించిన ప్రగతిని ప్రస్తావిస్తూ , మనమందరం మహాదేవుడి సంకల్పానికి కేవలం సాధనాలు మాత్రమేనని ప్రధాన మంత్రి స్పష్టంగా చెప్పారు. మహదేవ్ ఆశీస్సులతో గత పదేళ్లుగా కాశీలో 'వికాస్ కా డమ్రూ' ప్రతిధ్వనిస్తోందన్నారు. కోట్లాది రూపాయల విలువైన ప్రాజెక్టుల గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, శివరాత్రి, రంగ్ భరి ఏకాదశికి ముందు కాశీ నేడు అభివృద్ధి పండుగను జరుపుకుంటోందన్నారు. 'వికాస్ కీ గంగ' ద్వారా ప్రతి ఒక్కరూ మార్పును చూశారని ఆయన అన్నారు.

కాశీ కేవలం విశ్వాస కేంద్రం మాత్రమే కాదని, భారతదేశ శాశ్వత చైతన్యానికి ఇది ఒక శక్తివంతమైన కేంద్రం అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రాచీన ప్రతిష్ఠ కేవలం ఆర్థిక శక్తిపై ఆధారపడి లేదని, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక సంపద దాని వెనుక ఉందని ఆయన అన్నారు. కాశీ, విశ్వనాథ్ ధామ్ వంటి తీర్థాలు దేశాభివృద్ధికి 'యజ్ఞశాల' వంటివి అని అంటూ సంస్కృతి, ఆధ్యాత్మిక ప్రదేశాలతో భారత విజ్ఞాన సంప్రదాయానికి ఉన్న సంబంధాలను వివరించారు. కాశీ ఉదాహరణ ద్వారా తన అభిప్రాయాన్ని వివరిస్తూ, కాశీ శివుని భూమితో పాటు, బుద్ధుని బోధనల ప్రదేశం అని, జైన తీర్థంకరుల జన్మస్థలం అలాగే ఆది శంకరాచార్యులకు జ్ఞానోదయ ప్రదేశం అని అన్నారు. దేశం నలుమూలల నుంచి, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు కాశీకి వస్తుండటంతో కాశీ కాస్మోపాలిటన్ ఆకర్షణ సంతరించుకుందని ఆయన అన్నారు. "ఇంత వైవిధ్యం ఉన్న చోట కొత్త ఆదర్శాలు పుట్టుకొస్తాయి. కొత్త ఆలోచనలు పురోభివృద్ధికి దోహదపడతాయి" అని ప్రధాన మంత్రి తన పేర్కొన్నారు.

"విశ్వనాథ్ ధామ్ ఒక నిర్ణయాత్మక దిశను ఇస్తుంది. భారతదేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు తీసుకెళ్తుంది" అని కాశీ విశ్వనాథ్ ధామ్ ప్రారంభోత్సవం సందర్భంగా తన ప్రసంగాన్ని గుర్తు చేసుకుంటూ, ఈ రోజు ఆ నమ్మకాన్ని పునరుద్ఘాటించారు. విశ్వనాథ్ ధామ్ కారిడార్ నేడు పాండిత్య ప్రకటనకు సాక్ష్యంగా నిలుస్తోందని, న్యాయశాస్త్ర సంప్రదాయాలను పునరుద్ధరిస్తోందని ఆయన ఉద్ఘాటించారు. "కాశీ శాస్త్రీయ స్వరాలను అలాగే లేఖన సంభాషణలను వినగలదు" అని ప్రధాన మంత్రి అన్నారు, ఇది ఆలోచనల మార్పిడిని ప్రోత్సహిస్తుందని, పురాతన విజ్ఞానాన్ని పరిరక్షిస్తుందని, కొత్త భావజాలాలను సృష్టిస్తుందని చెప్పారు. కాశీ సంసద్ సంస్కృత ప్రతియోగిత, కాశీ సంసద్ జ్ఞాన్ ప్రతియోగిత ఇటువంటి ప్రయత్నాలలో భాగమని, సంస్కృతం చదవాలనుకునే వేలాది మంది యువతకు స్కాలర్ షిప్ లతో పాటు పుస్తకాలు, దుస్తులు, ఇతర అవసరమైన వనరులను అందిస్తున్నామని ఆయన అన్నారు. ఉపాధ్యాయులకు కూడా సహకరిస్తున్నట్టు తెలిపారు. కాశీ తమిళ సంగమం, గంగా పుష్కరాల మహోత్సవ్ వంటి 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' ప్రచారాల్లో విశ్వనాథ్ ధామ్ కూడా భాగమైందని, గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సామాజిక సమ్మిళిత సంకల్పాన్ని ఈ విశ్వాస కేంద్రం బలపరుస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. కాశీ పండితులు, విద్వత్ పరిషత్ లు కూడా ఆధునిక విజ్ఞాన దృక్పథంతో ప్రాచీన విజ్ఞానంపై కొత్త పరిశోధనలు చేస్తున్నాయని శ్రీ మోదీ తెలియజేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉచిత భోజన ఏర్పాట్లు చేసిన ఆలయ ట్రస్టు గురించి కూడా ఆయన ప్రస్తావించారు. "కొత్త కాశీ నవ భారతదేశానికి ప్రేరణగా ఆవిర్భవించింది" అని ప్రధాని అన్నారు, విశ్వాస కేంద్రం సామాజిక , జాతీయ సంకల్పాలకు శక్తి కేంద్రంగా ఎలా మారుతుందో వివరించారు. ఇక్కడి నుంచి వచ్చే యువత ప్రపంచవ్యాప్తంగా భారతీయ విజ్ఞానం, సంప్రదాయం, సంస్కృతికి పతాకధారులుగా నిలుస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

''మన జ్ఞానం, సైన్స్ , ఆధ్యాత్మికత అభివృద్ధికి అమితంగా దోహదం చేసిన భాషలలో సంస్కృతం అత్యంత ముఖ్యమైనది. భారతదేశం ఒక ఆలోచన, సంస్కృతం దాని ప్రధాన వ్యక్తీకరణ. భారతదేశం ఒక ప్రయాణం, సంస్కృతం దాని చరిత్రలో ప్రధాన అధ్యాయం. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి పుట్టినిల్లు, సంస్కృతం దాని మూలం" అన్నారు. ఖగోళ శాస్త్రం, గణితం, వైద్యం, సాహిత్యం, సంగీతం, కళలలో పరిశోధనలకు సంస్కృతం ప్రధాన భాషగా ఉన్న కాలాన్ని ప్రధాన మంత్రి గుర్తు చేశారు. ఈ విభాగాల ద్వారానే భారత్ కు గుర్తింపు వచ్చిందన్నారు. కాశీ, కంచిలో వేద పారాయణం 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'కు మూలమని అన్నారు.ప్రధానమంత్రి మాట్లాడుతూ, "ప్రస్తుతం కాశీని వారసత్వానికి, అభివృద్ధికి ఒక నమూనాగా చూస్తున్నారు. సంప్రదాయాలు, ఆధ్యాత్మికత చుట్టూ ఆధునికత ఎలా విస్తరిస్తుందో నేడు ప్రపంచం చూస్తోంది" అన్నారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ తర్వాత కాశీ మాదిరిగానే అయోధ్య ఎలా అభివృద్ధి చెందుతోందో వివరించారు. కుషినగర్ లోని అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రస్తావిస్తూ, దేశంలో బుద్ధుడికి సంబంధించిన ప్రదేశాలలో ఆధునిక మౌలిక సదుపాయాలు , సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రధాని ప్రముఖంగా వివరించారు.

నేటి కందం– నేటికి అందం

పరమాత్ముని పదసన్నిధి
వరలెడి భాగ్యము గలిగిన వరణీయులకై
తిరుపతి పట్టణ స్థాపన
జరిగిన ఈదినము మనకు సంతసము నిడున్

( 24-2-1130 తిరుపతి పట్టణ స్థాపన జరిగిన రోజు)



-రాధశ్రీ

సెల్:9494481210

# మూడవ ఏట అడుగిడిన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం

24 ఫిబ్రవరి 2022న 4.4 కోట్ల జనాభా కలిగిన ఉక్రెయిన్‌పై రష్యా ముప్పేట దాడితో ప్రారంభమైన భీకర యుద్ధం గత ఏడాదిగా కొనసాగుతూనే ఉన్నది. ఇరుపక్షాలు అపార ఆస్తి, ప్రాణ నష్టాలను చవిచూస్తూనే ఉన్నాయి. యుక్రెయిన్ దేశంలో యుద్ధం మిగిల్చిన విధ్వంసంతో 138 బిలియన్ యూయస్ డాలర్ల మౌళిక సదుపాయాలు బుగ్గిపాలు కావడం, లక్షల మంది పౌరులు నిరాశ్రయులు కావడం, శరణార్థులుగా పొరుగు దేశాలకు/ప్రాంతాలకు వలసలు వెళ్లడం జరుగుతున్నది. ఈ భీకర యుద్ధంలో దాదాపు 3 లక్షల వరకు రష్యన్ సైనికులు క్షతగాత్రులు కాగా దాదాపు 60,000 మంది మరణించడం జరుగగా, ఉక్రెయిన్ పక్షాన 1.2 లక్షలకు పైగా సైనికులు గాయపడడం/మరణించడం, 70,000లకు పైగా పౌరులు కూడా ప్రాణాలు కోల్పోవడం జరిగింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రారంభించిన ఏకపక్ష యుద్ధంతో ఉక్రెయిన్ పక్షాన యూయస్, యూరొప్ పశ్చిమ దేశాలు నిలుస్తూ అన్ని రకాలుగా ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి సహాయం చేస్తూ రష్యా దాడిని గత ఏడాది కాలంగా నిలువరించడంలో దోహదపడుతూ ఉన్నారు. ఈ యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం, ఆహార అభద్రత, ఇంధన కొరత, పర్యావరణ విచ్ఛిన్నం, ఆర్థిక సంక్షోభం లాంటి సమస్యలు ఉత్పన్నం కావడం జరుగుతున్నది.

## ప్రభావమే చూపని ఐక్యరాజ్యసమితి తీర్మానం:

ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి ఏడాది పూర్తి అయిన సందర్భంగా 23 ఫిబ్రవరి 2023 నిర్వహించిన 193- సభ్యత్వం కలిగిన ఐరాస 11వ అత్యవసర ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో రష్యా దాడిని ఖండిస్తూ యుద్ధం ముగియడానికి రష్యా బలగాలు బేషరతుగా సత్వరమే వెనక్కి తగ్గాలని కోరుతూ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో 141 దేశాలు యుద్ధ అంతానికి రష్యా బేషరతుగా, వెంటనే వెనక్కి తగ్గాలని కోరగా తీర్మానించగా, 07 దేశాలు (బెలారస్, కొరియా, ఎరిట్రియా, మాలి, నికార్గువా, రష్యా, సిరియా) వ్యతిరేకించగా, 32 దేశాలు ఓటింగుకు హాజరు కాలేదు. ఓటింగుకు హాజరు కాని దేశాల్లో ఇండియా, చైనా లాంటి దేశాలు ఉండడం విశేషం. ఓటింగుకు దూరంగా ఉన్న ఇండియా కూడా యుద్ధం త్వరగా అంతం కావాలని ఇరుపక్షాలను కోరడం మనకు తెలుసు. ఈ ఐరాస తీర్మానానికి ఎలాంటి చట్టబద్దత లేనప్పటికీ అధిక దేశాలు యుద్ధ ముగింపును కోరుకుంటున్నట్లు తెలుస్తున్నది. భద్రతా మండలిలో రష్యా, చైనా లాంటి దేశాల వీటో పవర్‌తో యుద్ధ అంతానికి ఐరాస ప్రయత్నాలు నిర్వీర్యం అవుతున్నాయి. పుతిన్ పుర్రెలో తిరిగిన దాడి పురుగు కారణంగా ఉక్రెయిన్‌ను ఆక్రమించాలనే దుస్సాహసానికి వ్యతిరేకంగా యుద్ధం ఏడాది కాలంగా కొనసాగడం, ఉక్రెయిన్ ప్రతిఘటనకు (యూయస్, యూరొప్ దేశాలు చేయూతనిస్తూ) రష్యా బలగాలు అపార నష్టాలను చవిచూడడం, దిక్కుతోచని దుస్థితిలో రష్యా యుద్ధం కొనసాగించడం జరుగుతున్నది.

## చర్చల ద్వారా పరిష్కారం దొరకదా?!

ఉక్రెయిన్‌పై రష్యా దాడిని సమర్థించుకుంటున్న అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ ఈ యుద్ధం కొనసాగడానికి అమెరికా నేతృత్వంలోని పశ్చిమ దేశాలే కారణమని, తమ భూభాగాలను పొందడానికి మాత్రమే ఈ పోరాటం చేస్తున్నామని వాదిస్తున్నారు. మా పోరాటంలో మా మిత్రుడైన చైనా కూడా తమ వైపు నిలబడి చేయూతను ఇస్తున్నట్లు తెలుపుతున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఎన్నటికీ మాస్కో గెలవడం అసాధ్యమని యూరొప్ దేశాలు రష్యాను హెచ్చరిస్తున్నాయి. కొద్ది రోజుల్లో/వారాల్లో ముగియవచ్చునుకున్న యుద్ధం వీరోచిత ఉక్రెయిన్ ప్రతిదాడులతో ఏడాది పాటు కొనసాగడం, అపార నష్టాలను ఇరు దేశాలు చవిచూడడం, ప్రపంచ దేశాలు పలు తీవ్ర ప్రభావాలను ఎదుర్కోవడం జరుగుతున్నది. పుతిన్, జెలెన్‌స్కీలు వెనక్కి తగ్గకుండా సై అంటే సై అంటూ కాలుదువ్వడం, యుద్ధాన్ని భీకర స్థాయిలో కొనసాగించడం చూస్తున్నాం. ఉక్రెయిన్ గెలిస్తే అంతర్జాతీయ వేదికల్లో రష్యా ప్రాబల్యం తగ్గడం, రష్యా గెలిస్తే నాటో కూటమితో కొత్త వివాదాలు తలెత్తే అవకాశమే కాకుండా మరికొన్ని యుద్ధాలను ప్రపంచం చూడవచ్చని ఊహిస్తున్నారు. అమెరికా మిత్రదేశాలు అందిస్తున్న ఆయుధాలు, టెక్నాలజీ, ఆర్థిక సహాయంతో ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నది. ఈ సహాయం ఎన్ని రోజులు దొరుకుతుందో తెలియదు.

ఎంతటి సమస్యలను అయినా ప్రజాస్వామ్యయుత చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని, ప్రపంచ దేశాలతో పాటు ఐరాస కూడా ఈ దిశగా ఇరుపక్షాలను అంగీకరింపజేసి, మధ్యేమార్గంగా రాజీ కుదిర్చి ప్రపంచ శాంతి స్థాపన దిశగా పటిష్ట అడుగులు చేయాలని పౌర సమాజం కోరుకుంటున్నది. అలసిన ఆర్థికంగా చితికి పోయిన ఇరుదేశాలు నేడు యుద్ధ అంతానికి మార్గాలను వెతికి పోరుకు చరమ గీతం పాడాలి. ఈ రెండు దేశాల కృపక్షాన నిలిచిన దేశాలు కూడా సంధి ద్వారాలను వెతకాలి. ఉక్రెయిన్ జెలెన్స్కీ, రష్యా పుతిన్‌లు యుద్ధ గాయాలకు లేపనాలద్దుతూ మానవీయ కోణంలో పరిష్కారాలను శోధించాలి. యుద్ధాలు ఎన్నటికీ మారణహోమ గుండాలని గత యుద్ధ చరిత్రలు ఘోషిస్తున్నాయి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# గుజరాత్‌లోని నవ్సారిలో రూ.47,000 కోట్లకుపైగా విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు అంకితం, శంకుస్థాపన చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గురువారం నాడు గుజరాత్ లోని నవ్సారి లో రూ.47,000 కోట్ల కు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల అంకితం, శంకుస్థాపన బ్యార్యక్రమం లో పాల్గొన్నారు. విద్యుదుత్పత్తి, రైలు, రోడ్డు, జౌళి, విద్య, నీటి సరఫరా, కనెక్టివిటీ, పట్టణాభివృద్ధి వంటి విస్తృత శ్రేణి రంగాల ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఈ రోజు గుజరాత్ లో ఇది తన మూడో కార్యక్రమం అని, మొదట గుజరాత్ కు చెందిన పశు పాలకులు (పశువుల పెంపకందారులు), పాడిపరిశ్రమలో భాగస్వాములతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నామని చెప్పారు. తరువాత మెహసానాలోని వలీనాథ్ మహాదేవ్ ఆలయంలో జరిగిన ప్రాణ ప్రతిష్ఠలో పాల్గొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. "ఇప్పుడు నేను నవ్సారిలో ఈ అభివృద్ధి ఉత్సవంలో పాల్గొంటున్నాను" అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో ఫ్లాష్ లైట్లను ఆన్ చేసి, ఈ మహత్తర అభివృద్ధి ఉత్సవంలో భాగస్వాములు కావాలని కోరారు. టెక్స్ టైల్, విద్యుత్, పట్టణాభివృద్ధి రంగాల్లో వడోదర, నవ్సారి, భరూచ్, సూరత్ తదితర ప్రాంతాల్లో రూ.40,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టిన సందర్భంగా ప్రధాన మంత్రి పౌరులను అభినందించారు.

'మోదీ కీ గ్యారంటీ' ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, తాను ఇచ్చిన హామీలు నెరవేరుతాయన్న భరోసాను ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు, ఇది గుజరాత్ ప్రజలకు చాలా కాలంగా తెలిసిన వాస్తవం అని అన్నారు. వ్యవసాయం, ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్ అంటూ ఐదు 'ఎఫ్' ల గురించి తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాట్లాడే వారని గుర్తు చేసుకున్నారు. "నేడు, పట్టు నగరమైన సూరత్ నవ్సారి వరకు విస్తరించబడుతోంది" అని ప్రధాన మంత్రి అన్నారు, ఈ రంగంలో అతిపెద్ద ఉత్పత్తిదారులు , ఎగుమతి దారులతో పోటీపడే భారతదేశ సామర్థ్యాన్ని వివరించారు. గుజరాత్ టెక్స్ టైల్ పరిశ్రమ ప్రత్యేకతను చెబుతూ, సూరత్ లో తయారయ్యే టెక్స్ టైల్స్ కు ఉన్న విశిష్ట గుర్తింపును ప్రధాన మంత్రి వివరించారు. పీఎం మిత్ర పార్కు నిర్మాణం పూర్తయితే మొత్తం ప్రాంత ముఖచిత్రమే మారిపోతుందని, దీని నిర్మాణానికే రూ.3,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆయన ఉద్ఘాటించారు. కటింగ్, వీవింగ్, జిన్నింగ్, గార్మెంట్స్, టెక్నికల్ టెక్స్ టైల్స్, టెక్స్ టైల్ మెషినరీ వంటి కార్యకలాపాలకు పీఎం మిత్ర పార్కు విలువ గొలుసు పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుందని, అదే సమయంలో ఉపాధికి ఊతమిస్తుందని ఆయన అన్నారు. ఈ పార్కులో కార్మికులకు ఇళ్లు, లాజిస్టిక్స్ పార్కు, గిడ్డంగులు, ఆరోగ్య సౌకర్యాలు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు ఉంటాయని ప్రధాన మంత్రి తెలియజేశారు.

రూ.800 కోట్లకు పైగా విలువ చేసే తాపీ రివర్ బ్యారేజీకి శంకుస్థాపన చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇది సూరత్ లో నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తుందని , వరద లాంటి పరిస్థితులను నివారించడంలో కూడా సహాయపడుతుందని ప్రధాన మంత్రి చెప్పారు.

దైనందిన జీవితంలో, పారిశ్రామికాభివృద్ధిలో విద్యుత్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ప్రధాన మంత్రి, 20-25 సంవత్సరాల క్రితం గుజరాత్ లో విద్యుత్ కోతలు చాలా తరచుగా ఉండేవని గుర్తు చేశారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పుడు ఎదుర్కొన్న సవాళ్లను కూడా ప్రస్తావిస్తూ బొగ్గు, గ్యాస్ దిగుమతులు ప్రధాన అవరోధాలుగా పేర్కొన్నారు. జలవిద్యుదుత్పత్తికి ఉన్న కనీస అవకాశాలను కూడా ఆయన ప్రస్తావించారు. రాష్ట్రాన్ని విద్యుత్ ఉత్పత్తి సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తూ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, నేడు గుజరాత్ లో భారీ మొత్తంలో విద్యుదుత్పత్తి చేస్తున్న సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని ప్రస్తావిస్తూ ప్రధాని 'మోదీ హై తో ముంకిన్ హై' అంటూ ఉద్వేగానికి లోనయ్యారు.

విద్యుత్ ఉత్పత్తి సంక్షోభం నుండి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తాను "మోదీ హై తో ముమ్కిన్ హై" అంతర్దృష్టి అందించామని , అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, సౌర పవన విద్యుత్ ఉత్పత్తికి పెద్దపీట వేయడం తో నేడు గుజరాత్‌లో భారీ విద్యుత్ ఉత్పత్తి అవుతోందని చెప్పారు.

అణువిద్యుత్ ఉత్పాదన గురించి వివరిస్తూ, కక్రాపర్ అటామిక్ పవర్ స్టేషన్ (కెఏపిఎస్) యూనిట్ 3 , యూనిట్ 4 లో రెండు కొత్త స్వదేశీ ప్రెజర్డ్ హెవీ వాటర్ రియాక్టర్ల (పిహెచ్ డబ్ల్యుఆర్) ను ఈ రోజు జాతికి అంకితం చేసినట్టు ప్రధాన మంత్రి చెప్పారు. ఈ రియాక్టర్లు ఆత్మనిర్భర్ భారత్ కు ఉదాహరణలని, గుజరాత్ అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.

పెరుగుతున్న ఆధునిక మౌలిక సదుపాయాలతో దక్షిణ గుజరాత్ అపూర్వమైన అభివృద్ధిని ప్రధాన మంత్రి ప్రస్తావించారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా కుటుంబాల విద్యుత్ బిల్లులు తగ్గడమే కాకుండా ఆదాయాన్ని ఆర్జించే మాధ్యమంగా మారుతుందని చెప్పారు. దేశంలోని మొట్టమొదటి బుల్లెట్ రైలు ఈ ప్రాంతం గుండా వెళ్తుందని, ఈ ప్రాంతం దేశంలోని పెద్ద పారిశ్రామిక కేంద్రాలైన ముంబై, సూరత్ లను కలుపుతుందని ప్రధాన మంత్రి తెలియజేశారు.

"నవ్సారి ఇప్పుడు తన పారిశ్రామిక అభివృద్ధి తో గుర్తింపు పొందుతోంది" అని ప్రధాని మోదీ అన్నారు, నవ్సారితో సహా మొత్తం పశ్చిమ గుజరాత్ వ్యవసాయ పురోగతికి ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని రైతులకు ప్రయోజనాలను అందించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల గురించి శ్రీ మోదీ మాట్లాడుతూ, పండ్ల సాగు ఆవిర్భావాన్ని గురించి వివరించారు. నవ్సారి నుండి ప్రపంచ ప్రసిద్ధి చెందిన హాపస్ వల్సారి రకాల మామిడి , చికూ (సపోడిల్లా) గురించి ప్రస్తావించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు రూ.350 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందిందని ప్రధాని తెలిపారు.

యువత, పేదలు, రైతులు, మహిళల సాధికారతకు తాను ఇచ్చిన హామీని ప్రధాని పునరుద్ఘాటించారు. ఈ హామీ కేవలం పథకాలను రూపొందించడానికి మాత్రమే కాకుండా అందరికీ అందేలా నిర్ధారించడానికి కూడా వర్తిస్తుందని ఆయన అన్నారు.

గిరిజన, తీరప్రాంత గ్రామాలను గతంలో నిర్లక్ష్యం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం ఉమర్గాం నుంచి అంబాజీ వరకు ఈ ప్రాంతంలో అన్ని మౌలిక వసతులు కల్పించిందన్నారు. జాతీయ స్థాయిలో కూడా అభివృద్ధిలో వెనుకబడిన 100కు పైగా ఆకాంక్షాత్మక జిల్లాలు దేశంలోని మిగతా ప్రాంతాలతో కలిసి ముందుకు సాగుతున్నాయని అన్నారు .

''ఇతరుల నుండి ఆశలు సన్నగిల్లిన చోట మోడీ హామీ ప్రారంభమవుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు. పేదలకు పక్కా ఇళ్లు, ఉచిత రేషన్ పథకం, విద్యుత్, తాగునీరు, పేదలు, రైతులు, దుకాణదారులు, కూలీలకు బీమా పథకాలు వంటి హామీలను వివరించారు. "ఇది నేడు వాస్తవం ఎందుకంటే ఇది మోదీ హామీ" అని శ్రీ మోదీ అన్నారు.

గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ అనీమియా సమస్యను ప్రస్తావిస్తూ, ఈ వ్యాధిని నిర్మూలించడానికి జాతీయ స్థాయిలో సమిష్టి కృషి చేయాల్సిన అవసరాన్ని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. తన ముఖ్యమంత్రి రోజుల్లో సికిల్ సెల్ అనీమియాను ఎదుర్కోవడానికి రాష్ట్రం చేపట్టిన ముందస్తు చర్యలను ప్రస్తావించిన ప్రధాన మంత్రి, వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి విస్తృతమైన జాతీయ ప్రయత్నాలను కూడా వివరించారు. సికిల్ సెల్ అనీమియా నుంచి విముక్తి కల్పించేందుకు జాతీయ మిషన్ ను ప్రారంభించామని, దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ఈ వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర చొరవను ప్రధాని మోదీ వివరించారు. ఈ మిషన్ లో భాగంగా దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ అనీమియాకు స్క్రీనింగ్ లు నిర్వహిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రానున్న మెడికల్ కాలేజీల గురించి ప్రస్తావించారు.

పేద, మధ్యతరగతి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల తో నిమిత్తం లేకుండా ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.

మునుపటి కాలంలోని ఆర్థిక స్తబ్దతను గుర్తు చేస్తూ, "ఆర్థిక స్తబ్దత అంటే దేశానికి పరిమిత ఆర్థిక వనరులు ఉండడం " అని ప్రధాన మంత్రి వివరించారు, ఆ కాలంలో గ్రామీణ పట్టణ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని నొక్కి చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ 2014 లో 11 వ స్థానం నుండి 5 వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందని, దీని అర్థం నేడు భారత పౌరులకు ఖర్చు చేయడానికి ఎక్కువ డబ్బు ఉందని, అందువల్ల భారతదేశం దానిని ఖర్చు చేస్తోందని ఆయన అన్నారు. అందువల్ల, నేడు దేశంలోని చిన్న నగరాల్లో కూడా అద్భుతమైన కనెక్టివిటీ మౌలిక సదుపాయాలు నిర్మించబడుతున్నాయి. చిన్న పట్టణ కేంద్రాల నుంచి కూడా విమాన ప్రయాణ సౌకర్యం, అందుబాటులో ఉందని, నాలుగు కోట్ల పక్కా గృహాలు నిర్మించామని చెప్పారు.

డిజిటల్ ఇండియా కార్యక్రమం విజయాన్ని, పరిధిని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, "ఈ రోజు ప్రపంచం డిజిటల్ ఇండియాను గుర్తించింది" అని అన్నారు. కొత్త స్టార్టప్ లు, క్రీడారంగం లో యువత ఆవిర్భావంతో డిజిటల్ ఇండియా చిన్న నగరాల రూపురేఖలను మార్చిందని ఆయన ఉద్ఘాటించారు. ఇలాంటి చిన్న పట్టణాల్లో నయా మధ్యతరగతి ఆవిర్భావం భారత్ ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు దోహద పడుతుందని ఆన్నారు.

అభివృద్ధితో పాటు వారసత్వానికి ప్రాధాన్యమివ్వడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, స్వాతంత్ర్యోద్యమం లేదా జాతి నిర్మాణం ఏదైనా ఈ ప్రాంతం భారతదేశ విశ్వాసం , చరిత్రకు ఒక ముఖ్యమైన కేంద్రంగా ఉందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. బంధుప్రీతి, బుజ్జగింపు, అవినీతి రాజకీయాల కారణంగా ఈ ప్రాంత వారసత్వం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దీనికి భిన్నంగా, భారతదేశపు గొప్ప వారసత్వం ప్రతిధ్వని నేడు ప్రపంచవ్యాప్తంగా వినబడుతోందని ప్రధాన మంత్రి అన్నారు. దండి ఉప్పు సత్యాగ్రహం జరిగిన ప్రదేశంలో దండి మెమోరియల్ అభివృద్ధి, సర్దార్ పటేల్ కృషికి అంకితమైన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ఏర్పాటు గురించి ఆయన ప్రస్తావించారు.

ప్రసంగాన్ని ముగిస్తూ, ప్రధాన మంత్రి, వచ్చే 25 సంవత్సరాల పాటు దేశాభివృద్ధికి రోడ్ మ్యాప్ ఇప్పటికే సిద్ధమయిందని ఆన్నారు. "ఈ 25 సంవత్సరాలలో, మనం ఒక వికసిత్ గుజరాత్, ఒక వికసిత్ భారత్ను తయారు చేస్తాము" అని ప్రధాని అన్నారు.

గుజరాత్ ముఖ్య మంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ , పార్లమెంటు సభ్యుడు శ్రీ సి.ఆర్ .పాటిల్ తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, గుజరాత్ ప్రభుత్వానికి చెందిన మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాన మంత్రి జాతికి అంకితం చేశారు. వడోదర ముంబై ఎక్స్ ప్రెస్ వే లోని బహుళ ప్యాకేజీలు: భరూచ్, నవ్సారి, వల్సాద్ లలో బహుళ రహదారి ప్రాజెక్టులు; తాపిలో గ్రామీణ మంచినీటి సరఫరా ప్రాజెక్టు; భరూచ్ లో భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టు వీటిలో ఉన్నాయి. నవ్సారిలో పీఎం మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్ టైల్ రీజియన్, అపెరల్ (పీఎం మిత్ర) పార్కు నిర్మాణ పనులను ప్రధాని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ముఖ్యమైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వీటిలో భరూచ్-దహేజ్ యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్ ప్రెస్ వే; వడోదరలోని ఎస్.ఎస్.జి ఆసుపత్రిలో బహుళ ప్రాజెక్టులు; వడోదరలో ప్రాంతీయ సైన్స్ కేంద్రం; సూరత్, వడోదర, పంచమహల్ లలో రైల్వే గేజ్ మార్పిడి ప్రాజెక్టులు; భరూచ్, నవ్సారి సూరత్ లలో బహుళ రహదారి ప్రాజెక్టులు; వల్సాద్ లో అనేక నీటి సరఫరా పథకాలు, పాఠశాల, హాస్టల్ భవనం ,నర్మదా జిల్లాలో ఇతర ప్రాజెక్టులు ఉన్నాయి.

సూరత్ మునిసిపల్ కార్పొరేషన్, సూరత్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ, డ్రీమ్ సిటీకి చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ పిసిఐఎల్) రూ .22,500 కోట్లకు పైగా వ్యయంతో కక్రాపర్ అటామిక్ పవర్ స్టేషన్ (కె ఎ పి ఎస్ ) యూనిట్ 3, యూనిట్ 4లో నిర్మించే రెండు కొత్త ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లను (పిహెచ్ డబ్ల్యూఆర్) ప్రధాని జాతికి అంకితం చేశారు. కె ఎ పి ఎస్-3, కె ఎ పి ఎస్-4 ప్రాజెక్టులు 1400 (700×2) మెగావాట్ల సంచిత సామర్థ్యాన్ని కలిగిన అతిపెద్ద స్వదేశీ పిహెచ్ డబ్ల్యూ ఆర్ లు. ఇవి ప్రపంచంలోనే ఉత్తమమైన రియాక్టర్లతో పోల్చదగిన అధునాతన భద్రతా లక్షణాలను కలిగి ఉన్నాయి. ఈ రెండు రియాక్టర్లు కలిపి సంవత్సరానికి 10.4 బిలియన్ యూనిట్ల స్వచ్ఛమైన విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, గోవా , కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీ , డామన్ అండ్ డయ్యూ వంటి బహుళ రాష్ట్రాల వినియోగదారులకు ప్రయోజనం చేకూరుస్తాయి.

# విశాఖ తీరంలో పాక్ జలాంతర్గామి ఘాజీ శకలాలు గుర్తింపు ..

విశాఖపట్నం ఫిబ్రవరి 23: 1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో బంగాళాఖాతంలోకి విశాఖపట్టణం వరకుచొచ్చుకొచ్చి భారత్‌ను దొంగదెబ్బ తీయాలని ప్రయత్నించి చావుదెబ్బలు తిన్న పాక్ జలాంతర్గామి పీఎన్ఎస్ ఘాజీ శకలాలను భారత నౌకాదళం గుర్తించింది. ఇండియన్ నేవీలోని సబ్‌మెరైన్ రెస్క్యూ విభాగం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి వీటిని గుర్తించింది. భారత అమ్ములపొదిలోకి ఇటీవల వచ్చి చేరిన 'ది డీప్ సబ్‌మెర్జెన్స్ రెస్క్యూ వెహికల్ (డీఎస్ఆర్‌వీ) సాయంతో ఈ శకలాలను కనుగొన్నారు. విశాఖపట్టణం తీరానికి దాదాపు 2.5 కిలోమీటర్ల దూరంలోని సముద్ర గర్భంలో 100 మీటర్ల లోతున శకలాలు ఉన్నట్టు గుర్తించారు. అయితే, యుద్ధంలో చనిపోయిన వారిని గౌరవించడం మన నౌకాదళ ఆచారం కావడంతో వాటిని తాకలేదని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

2013లో ఐఎన్ఎస్ సింధ్‌రక్షక్ ప్రమాదానికి గురై 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాల సమయంలో సిబ్బందిని రక్షించేందుకు వీలుగా 2018లో తొలిసారి డీఎస్ఆర్‌వీ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. నౌకలు, జలాంతర్గాములు ప్రమాదానికి గురైనప్పుడు వాటిని గుర్తించి సహాయక చర్యలు చేపట్టేందుకు ఈ సాంకేతికతను ఉపయోగిస్తారు.

# 28న తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేనల బహిరంగ సభ



అమరావతి, ఫిబ్రవరి 23:రాబోయే ఎన్నికల్లో ఉమ్మడిగా బరిలోకి దిగుతోన్న టీడీపీ, జనసేన పార్టీలు నేడు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు.

ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలు, ఉమ్మడి మేనిఫెస్టోతో పాటు ఈనెల 28న. తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్న బహిరంగ సభపై చర్చించారు. ప్రతీ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు విభేదాలు లేకుండా పనిచేసేలా సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు అచ్చెన్నాయుడు. ఈనెల 28న జరిగే సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు

తెలుగుదేశం పార్టీని ఎన్డీఏలోకి ఆహ్వానించారని, దీనిపై త్వరలోనే క్లారిటీ వస్తుంది.. దాపరికం లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. భాజపాతో మాట్లాడుతున్నాం.. పొత్తు గురించి త్వరలోనే ప్రకటన ఉంటుందన్నారు. తెదేపా- జనసేన సమన్వయ కమిటీ సమావేశంలో 2 తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. పొత్తును స్వాగతించిన తెదేపా-జనసేన కేడర్‌ను అభినందిస్తూ తీర్మానం చేశామన్నారు. మీడియాపై దాడులను తప్పు పడుతూ సమన్వయ కమిటీ రెండో తీర్మానం చేసిందన్నారు. ఉమ్మడి మేనిఫెస్టోపై తుది కసరత్తు జరుగుతోందని, త్వరలో విడుదల చేస్తామని సమావేశం ముగిసిన తర్వాత అచ్చెన్న మీడియాకు తెలిపారు. ఏయే స్థానాల్లో ఎవరు పోటీ చేయాలనేది చంద్రబాబు, పవన్ నిర్ణయం తీసుకుంటారన్నారు. పొత్తులు పెట్టుకొనే సమయంలో కొన్ని త్యాగాలు తప్పవని, టికెట్లు కోల్పోయిన వాళ్లు బాధపడొద్దని అధినేతలిద్దరూ చెప్పారని గుర్తు చేశారు. తెదేపా- జనసేన మధ్య గొడవలు పెట్టేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వాలంటీర్ల గురించి మాట్లాడిన మంత్రి ధర్మానపై ఈసీకి ఫిర్యాదు చేసినట్టు వివరించారు.

కలిసి పని చేసే సమయం ఆసన్నమైందని, విపక్షాల ఓటు చీలకూడదనే ఏకైక లక్ష్యంతో ఈ పొత్తు పెట్టుకుంటున్నామని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్. .అంతేకాదు, ఉమ్మడిగా బహిరంగ సభను నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. తాడేపల్లిగూడెంలో ఈ నెల 28వ తేదీన బహిరంగ సభ నిర్వహిస్తామని, 500 మంది ప్రత్యేక అతిథులు, ఆరు లక్షల మంది సభకు వస్తారని అంచనా వేస్తున్నట్టు నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఇక టికెట్లు, సీట్ల పంపకాల విషయంలో రెండు పార్టీల మధ్య ఎలాంటి గ్యాప్ లేదన్నారు జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్

# బొగ్గు ఆధారిత సమాజాల ప్రయోజనం కోసం ప్రకృతికి సాధికారత, వృద్ధిని పెంపొందించడం, సుస్థిర హరిత చొరవల ద్వారా బొగ్గు రంగ ముఖచిత్రాన్ని మారుస్తుంది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:బొగ్గు మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వం మరియు పర్యవేక్షణలో బొగ్గు/లిగ్నైట్ పీ ఎస్ యూ లు దేశం యొక్క పెరుగుతున్న ఇంధన డిమాండ్‌లను తీర్చడానికి కాలక్రమేణా తమ ఉత్పత్తి స్థాయిలను పెంచుకోవడమే కాకుండా అనేక రకాల ఉపశమన మరియు సుస్థిరమైన చర్యలను అమలు చేయడం ద్వారా స్థానిక పర్యావరణానికి తమ నిబద్ధతను ప్రదర్శించాయి. సుస్థిర హరితీకరణ చొరవలో భాగంగా బొగ్గు/లిగ్నైట్ పీ ఎస్ యూ ల ద్వారా ఓవర్‌బర్డెన్ (ఓ బీ) డంప్‌లు, హాల్ రోడ్లు, గని పరిసరాలు, రెసిడెన్షియల్ కాలనీలు మరియు లీజు ప్రాంతం వెలుపల స్థానిక ప్రజలతో విస్తృతమైన చెట్లు నాటే కార్యక్రమాలు అందుబాటులో ఉన్న భూమితో సహా వివిధ ప్రదేశాలలో చేపట్టబడ్డాయి. శాస్త్రీయ సంస్థల సహకారంతో తోటల పెంపకం ప్రయత్నాలకు నైపుణ్యంతో మద్దతునిస్తాయి. పర్యావరణ పునరుద్ధరణ స్థలాల అభివృద్ధికి మరియు బహుళ-స్థాయి ప్లాంటేషన్ పథకాల అమలును సులభతరం చేస్తాయి.

మొక్కల పెంపకం కార్యక్రమం వైవిధ్యమైన విధానాన్ని అవలంబిస్తుంది, నీడనిచ్చే చెట్లు, అటవీ ప్రయోజనాల కోసం జాతులు, ఔషధ మరియు మూలికా మొక్కలు, ఫలాలను ఇచ్చే చెట్లు, కలప చెట్లు మరియు అలంకారమైన/రహదారులకు ఇరువైపులా మొక్కలు ఉన్నాయి. ఔషధ మొక్కలతో పాటు పండ్ల జాతులు జీవవైవిధ్య పరిరక్షణకు దోహదపడటమే కాకుండా స్థానిక సమాజాలకు అదనపు సామాజిక-ఆర్థిక ప్రయోజనాలను అందిస్తాయి. జామున్, ఇమ్లీ, గంగా ఇమ్లీ, బెల్, మామిడి, సీతాఫల్ మొదలైన పండ్ల జాతులు, వేప, కరంజ్, అయోన్లా (ఉసిరి), అర్జున్ మొదలైన ఔషధ/మూలికా మొక్కలు, సాల్, టేకు, శివన్ వంటి కలప చెట్లు, ఘమర్, సిస్సూ, కాలా సిరస్, సఫేద్ సిరస్, వెదురు, పెల్టోఫోరమ్, బబూల్, మొదలైనవి, అలంకారమైన / గుల్మోహర్, కచ్నార్, అమల్టాస్, పీపాల్, ఝురుల్ వంటి అలంకారమైన / అవెన్యూ మొక్కలు ఇందులో ఉన్నాయి. అంతేకాకుండా వీటికి రాష్ట్ర అటవీ శాఖలు మరియు కార్పొరేషన్‌లతో సన్నిహిత సహకారం ఉంటుంది. తోటల పెంపకం కోసం సరిపోయే ఉత్తమ జాతులు ఎంపిక చేయబడతాయి. హరిత పునరుద్ధరణ ప్రయత్నాల విజయం సుస్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది.

గత ఐదేళ్లలో ( ఎఫ్ వై 2019-20 నుండి ఎఫ్ వై 2023-24 జనవరి వరకు), బొగ్గు/లిగ్నైట్ పీ ఎస్ యూ లు 10,784 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో 235 లక్షల మొక్కలను నాటాయి, తద్వారా కార్బన్ సింక్ గణనీయంగా పెరిగింది. హరిత పునరుద్ధరణ పనితీరును పర్యవేక్షించడానికి, బొగ్గు/లిగ్నైట్ పీ ఎస్ యూ లు ఉపగ్రహ నిఘాను ఉపయోగిస్తాయి.

ఇటీవల, బొగ్గు/లిగ్నైట్ పీ ఎస్ యూ లు దాని అనువైన కమాండ్ ఏరియాలలో మియావాకీ ప్లాంటేషన్ పద్ధతిని అవలంబించాయి. మియావాకీ సాంకేతికత అటవీ పెంపకం మరియు పర్యావరణ పునరుద్ధరణకు ఒక విలక్షణమైన విధానం, దీనిని జపాన్ వృక్షశాస్త్రజ్ఞుడు డా. అకిరా మియావాకీ ప్రారంభించారు. పరిమిత ప్రాంతంలో హరితను పెంచడం దీని ప్రాథమిక లక్ష్యం. ఈ వినూత్న పద్ధతి కేవలం 10 సంవత్సరాలలో దట్టమైన అడవిని స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకుంది, ఈ ప్రక్రియకు సాధారణంగా ఒక శతాబ్దం అవసరం. వేగవంతమైన వృద్ధిని ప్రదర్శించే మరియు స్థానిక అడవులలో కనిపించే సహజ జీవవైవిధ్యాన్ని ప్రతిబింబించే బహుళ-దొంతరల అడవులను పెంపొందించడం ఇందులో ఉంటుంది. మియావాకీ పద్ధతిని అమలు చేయడం ద్వారా చదరపు మీటరుకు రెండు నుండి నాలుగు రకాల దేశీయ చెట్లను నాటాలి. ముఖ్యంగా, ఎంచుకున్న వృక్ష జాతులు ఎక్కువగా స్వీయప్రగతిని కలిగి ఉంటాయి. ఫలదీకరణం మరియు నీరు వంటి సాధారణ నిర్వహణ అవసరాన్ని తొలగిస్తాయి. ఈ పద్ధతిలో, చెట్లు స్వయం-సుస్థిరత్వాన్ని సాధిస్తాయి, మూడు సంవత్సరాల వ్యవధిలో వాటి పూర్తి ఎత్తును చేరుకుంటాయి. మొక్కల మధ్య ఒకదానికొకటి పరస్పర ఆధారపడటం పెరుగుదలకు మద్దతు ఇస్తుంది, ఇది మొత్తం వృక్ష ఆరోగ్యం మరియు శక్తిని ప్రోత్సహిస్తుంది. ఫలితంగా, చెట్లు సంప్రదాయ పద్ధతుల కంటే చాలా వేగంగా వృద్ధి రేటును ప్రదర్శిస్తాయి మరియు అధిక కార్బన్ సింక్‌ను సృష్టించేందుకు దోహదం చేస్తాయి.



# సేంద్రియ ఉత్పత్తుల ఎగుమతులు పెంచేందుకు ప్రత్యేక సేంద్రియ ప్రోత్సాహక విభాగాన్ని ఏర్పాటు చేసిన అపెడా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:భారతదేశం నుంచి సేంద్రియ ఉత్పత్తుల ఎగుమతులను పెంచడానికి, 'అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ' (ఎపీఈడీఏ) ప్రత్యేక సేంద్రియ ప్రోత్సాహక విభాగాన్ని ఏర్పాటు చేసింది. భారతదేశ సేంద్రియ ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలను సమన్వయం చేసే కేంద్ర వేదికగా ఈ విభాగం పని చేస్తుంది.

ఒక సమగ్ర వ్యూహం ద్వారా ఉత్తరాఖండ్ సేంద్రియ రంగాన్ని మెరుగుపరిచేందుకు అపెడా కృషి చేస్తోంది. వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచడం, ధృవీకరణ విధానాలను పెంచడం, ఎగుమతి చేయగల ప్రధాన ఉత్పత్తులను గుర్తించడంపై ఈ ప్రత్యేక విభాగం దృష్టి పెడుతుంది. ప్రపంచ సేంద్రియ ఉత్పత్తుల మార్కెట్‌లో ఉత్తరాఖండ్‌కు కీలక స్థాయి కల్పించడం అంతిమ లక్ష్యం.

భారతదేశపు మొట్టమొదటి సంపూర్ణ సేంద్రియ రాష్ట్రమైన సిక్కిం హోదాను మరింత పెంచేలా, ఆ రాష్ట్రం నుంచి ఎగుమతులను వైవిధ్యీకరించడానికి ఉ సాగు పద్ధతులను మరింత పటిష్టం చేయడానికి అపెడా వ్యూహాత్మక ప్రణాళిక రూపొందిస్తోంది. సేంద్రియ రంగంలో సిక్కింకున్న ప్రత్యేక బలాన్ని మెరుగుపరిచి, అంతర్జాతీయ వేదికపై ఆ రాష్ట్ర ప్రాముఖ్యతను పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఉత్తరాఖండ్ కోసం చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగిస్తూ, సిక్కిం కోసం ప్రణాళికలకు మరింత పదును పెడుతూనే, అవే వ్యూహాలను మరిన్ని రాష్ట్రాల్లో అమలు చేయడానికి అపెడా ప్రయత్నిస్తోంది. సేంద్రియ వ్యవసాయానికి ఎక్కువ అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రణాళికల ు అమలు చేయడం ద్వారా, భారతదేశ వ్యాప్తంగా సేంద్రియ ఎగుమతి కేంద్రాల గొలుసును రూపొందించాలని అపెడా భావిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లలో సేంద్రియ ఉత్పత్తుల లభ్యతను పెంచే ప్రయత్నంలో భాగంగా, 'నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్'లో (ఎన్‌పీఓపీ) గణనీయమైన మార్పులు జరుగుతున్నాయి. ఈయూ నిబంధనలు సహా అంతర్జాతీయ నిబంధనలు, ప్రమాణాలకు అనుగుణంగా ఉండడం ఎన్‌పీఓపీ మార్గదర్శకాల లక్ష్యం. ప్రస్తుతం ఉ భవిష్యత్‌లో పరస్పర గుర్తింపు ఒప్పందాలను దృష్టిలో పెట్టుకుని మార్పులు జరుగుతున్నాయి. ఎన్‌పీఓపీ ఐటీ వ్యవస్థను ఆధునికంగా మార్చడం ఇందులోని కీలకాంశం. మరింత పటిష్టమైన పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఆధునీకరించిన ఐటీ వ్యవస్థ అందిస్తుంది. ధృవీకరణ సంస్థలు, ధృవీకరణ పొందిన ఆపరేటర్లపై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. పొలాలను జియో-ట్యాగింగ్, తనిఖీ ప్రాంతాలను జియో-లొకేషన్ చేస్తుంది.

# కటుకూరి శ్రీనుకు నివాళులర్పించిన పరికపల్లి



ఖమ్మం, ఫిబ్రవరి 23:(నేటినిజం ప్రతినిధి): కొణిజర్ల మండలం పెద్దమునగాల గ్రామంలో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన కటుకురి శ్రీను దశదిన కర్మకు హాజరై చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శ్రీను అందరితో కలసి మెలిసి ఉండేవాడని చాలా మంచివాడని క్రమశిక్షణ గల కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, పొంగులేటి శ్రీనివాస రెడ్డి వీరాభిమాని అని వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోల శ్రీను, కంచు బీరయ్య, దాసరి వీరబాబు, మరికంటి ఏల్లయ్య, దెగల వెంకటేశ్వర్లు, నరేంద్ర నాయుడు, పునాటి బాబు, దోడ్డా బాబు, కావూరి శ్రీను, పదిమల నరేష్, ఉటుకూరి రంజిత్, పావగంటి చిన్న బాబు, నవళ్ల ముత్తయ్య, నరసింహారావు తదితరులున్నారు.

# ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకోవాలి- ఎంపీడీవో వేణుమాధవ్.



మహబూబాబాద్, ఫిబ్రవరి 22:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని వడ్డె కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మరియు నర్సరీని ఎంపీడీవో బి.వేణుమాధవ్ పరిశీలించడం జరిగినది. ప్రతి కుటుంబం వంద రోజులు పూర్తి చేయాలని, ఎండ తీవ్రత తాకకుండా సకాలంలో వచ్చి కొలతల ప్రకారం పని పూర్తి చేసుకొని పోవాలని కూలీలకు తగు సూచనలు ఇవ్వడం జరిగింది.పని ప్రదేశంలో నీడకు షేడ్ నెట్, నీటి సౌకర్యం కల్పించాలని కార్యదర్శికి ఫీల్డ్ అసిస్టెంట్ కు సూచన ఇవ్వడం జరిగింది. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డ్ లను, రిజిస్టర్లను పరిశీలించడం జరిగింది.వారితోపాటు టెక్నికల్ అసిస్టెంట్ సూధగాని యాకయ్య,పంచాయతీ కార్యదర్శి మురళి ,ఫీల్డ్ అసిస్టెంట్ హరీష్, మేట్లు కుమ్మరి రామ్మూర్తి,అనిల్ ఉన్నారు.

# ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ..



నిజామాబాద్, ఫిబ్రవరి 23: తెలంగాణ యూనివర్సిటీ సారంగపూర్ లోని బీఈడీ కళాశాలలో బీఈడీ మూడవ సెమిస్టర్ కి సంబంధించిన ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ జరుగుచుండగా ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంట చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది.

అందులో భాగంగా హాజరుకాని విద్యార్థులకు ఆబ్సెంట్, ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను మందలించడం జరిగింది.

అధ్యాపకులకు కూడా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచనలు చేశారు.

ఎప్పుడూ ఈ విధంగానే తనిఖీలు చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తే వ్యవస్థలో కొంత మార్పు వస్తుందని, విద్యారంగంలో మార్పులు వస్తాయని అధ్యాపకుల చర్చించుకుంటున్నారు.

# మానవుల ప్రాణాలను కాపాడేందుకు మేం చేయగలిగినదంతా చేస్తామన్న శ్రీ భూపేంద్ర యాదవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:వాయనాడులో పులుల, ఏనుగుల దాడుల కారణంగా మరణించిన బాధితుల కుటుంబాలను కేంద్ర పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు మంత్రి భూపేంద్ర యాదవ్ పరామర్శించారు.

రెండు రోజుల వాయనాడ్ పర్యటన కోసం బెంగళూరు నుంచి నేరుగా వచ్చిన కేంద్ర మంత్రి, వన్యప్రాణుల దాడులలో మరణించిన వారి కుటుంబాలను సందర్శించారు.

శ్రీ యాదవ్ పులి నోట మరణించిన ప్రజీష్ ఇంటికీ, ఏనుగుల దాడిలో మరణించిన పాల్, అజీష్‌ల ఇళ్లకు వెళ్ళారు.

బాధిత కుటుంబాలను ఓదార్చి, వారు, స్థానికులు చెప్పిన మాటలను కేంద్ర మంత్రి విన్నారు.

ఈ ప్రాంతంలో మానవుల - మృగాల మధ్య సంఘర్షణ ప్రధాన సమస్య అయిందని ఆయన అన్నారు. ఇటువంటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ క్షేత్రంలో పని చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులకు ప్రభుత్వం రాజకీయంగా, పాలనాపరంగాను అన్నిరకాల తోడ్పాటును అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారం ఉండాలని ఆయన అన్నారు. కేరళ, కర్నాటక రెండు రాష్ట్రాలూ ఇందులో ఉన్నందున, ఇరు రాష్ట్రాలకు చెందిన సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామని వివరించారు. తాను ఫిబ్రవరి 22వ తేదీన ఈ క్షేత్రంలో పని చేస్తున్న స్థానిక అధికారులు, ఎన్జీవోలతో తాను సమావేశమవుతున్నట్టు చెప్పారు. సమావేశం తర్వాత మరింత సమాచారమిస్తామన్నారు. పర్యావరణం, మానవ జీవితం రెండూ సమానంగా ముఖ్యం కనుకవాటిని పరిరక్షించాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ మార్గదర్శక దృష్టిని తాము అనుసరిస్తున్నామని ఆయన అన్నారు. జంతువుల పట్ల దయ అవసరమే అయినా నూతన సాంకేతికత సాయంతో మానవ జీవితాలను కాపాడాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఆరోపణలు రుజువు చేస్తే ఆస్తి మొత్తం రాసిస్తా- బాలినేని

ఒంగోలు, ఫిబ్రవరి 23: పేదల కోసం కొన్న భూములకు ఎకరాకు 8 లక్షల రూపాయలు ఇచ్చారని విపక్షాలు ఆరోపిస్తున్నాయని, వాటిని రుజువు చేస్తే నా ఆస్తి మొత్తం రాసిస్తాను అని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఇళ్ళ పట్టాల పంపిణీ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరైన సభలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఒంగోలులో పేదలకు సొంత ఇంటి కల సాకారం చేసిన జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు అని చెప్పారు. నిరుపేదలకు ఇళ్ళ పట్టాలు ఇవ్వలేకుంటే పోటీ కూడా చేయనని చెప్పానని అన్నారు.. సీఎం జగన్ ఇచ్చిన భరోసా వల్లే ధైర్యంగా ఆ మాట చెప్పగలిగాను అని ఆయన పేర్కొన్నారు. సీఎం వల్లే పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం సాకారమైందని ప్రశంసించారు. గతంలో పేదలకు ఇళ్ళ స్థలాల కోసం యర్రజర్లలో చూసిన ప్రభుత్వ భూమికి టీడీపీ అడ్డంకులు సృష్టించిందని ఫైర్ అయ్యారు. అందుకే అగ్రహారం, వెంగముక్కలపాలెంలలో భూములు చూశామని, ఇక్కడ కూడా టీడీపీ కోర్టు కేసులు వేయించి ఇబ్బందులు పెట్టాలని చూసింది అని ఆరోపించారు.

# కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా.. 10 మందికి తీవ్ర గాయాలు

ఖమ్మం, ఫిబ్రవరి 23:(నేటినిజం ప్రతినిధి): కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో పది మంది కూలీలకు తీవ్ర గాయాలుకాగా.. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పెద్దకోరుకొండి రైతు వేదిక సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన 10 మంది కూలీలు ఆటో కిరాయికి మాట్లాడుకుని కల్లూరు మండలంలోని ఓ గ్రామంలో మిరప పంటను ఏరేందుకు వెళుతున్నారు.

ఈ క్రమంలో పెద్దకోరుకొండి సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటో ప్రమాదవశాత్తు పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పది మంది కూలీలకు తీవ్ర గాయాలు కాగా.. వీరిలో మల్లారపు భద్రమ్మ, చీమకుర్తి కృష్ణమ్మ, బండి పద్మల పరిస్థితి విషమంగా ఉన్నది.

ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ షాకీర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో కల్లూరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం హాస్పిటల్ రెఫర్ చేశారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# టెట్, డీఎస్సీపై హైకోర్టులో విచారణ..

హైదరాబాద్, ఫిబ్రవరి 23:టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య సమయం ఉండేలా చూడాలంటూ దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో ఇవ్వాల (శుక్రవారం) విచారణ జరిగింది. షెడ్యూల్‌ను మార్చాలన్న పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై తుది విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. టెట్, డీఎస్సీ పరీక్షలకు కనీసం నెల రోజుల సమయం ఇవ్వడం సముచితమని హైకోర్టు తాజాగా ప్రాథమిక అభిప్రాయాన్ని ఇచ్చింది. షెడ్యూల్‌లో మార్పులు చేసే ఆలోచన ఏమైనా ఉందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో తగు ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పి విచారణను వాయిదా వేసింది. దీనిపై ఇటీవల విచారించిన కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# షిప్ బిల్డింగ్ మరియు షిప్ రిపేర్‌పై వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించిన నౌకాశ్రయాలు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 :నౌకాశ్రయాలు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ (ఎంఒపిఎస్‌డబ్ల్యూ) సెక్రటరీ శ్రీ టి.కె. రామచంద్రన్ అధ్యక్షతన ఓడల నిర్మాణం మరియు ఓడ మరమ్మత్తుపై దృష్టి సారించిన డైనమిక్ మరియు సహకార వర్క్‌షాప్‌ను నిర్వహించింది. కీలకమైన సమస్యలను చర్చించడానికి, ఉత్తమ అభ్యాసాలను పంచుకోవడానికి మరియు ఓడ నిర్వహణ మరియు నిర్మాణంలో ఆవిష్కరణలను పెంపొందించడానికి ఈ ఈవెంట్ సముద్ర పరిశ్రమకు చెందిన ముఖ్య వాటాదారులను ఒకచోట చేర్చింది.

షిప్ బిల్డింగ్ మరియు షిప్ రిపేర్‌పై వర్క్‌షాప్ భారతదేశంలో సముద్ర రంగాన్ని ఉన్నతీకరించడానికి పోర్ట్స్ షిప్పింగ్ మరియు వాటర్‌వేస్ మంత్రిత్వ శాఖ (ఎంఒపిఎస్‌డబ్ల్యూ) నిర్వహిస్తున్న చర్చల శ్రేణిలో ఇది తదుపరిది. ఫిబ్రవరి 14, 2024న మొదటి వర్క్‌షాప్ జరిగింది. ఇది "షిప్పింగ్ సెక్టార్‌లో ఫైనాన్సింగ్ మరియు ఇన్సూరెన్స్‌పై సవాళ్లు మరియు భావి పరిష్కారాలు"పై దృష్టి సారించింది. రెండవ వర్క్‌షాప్‌లోని చర్చలు ప్రధానంగా షిప్‌బిల్డింగ్ మరియు షిప్ రిపేర్ రంగాలపై జరిగాయి.

ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ టి.కె. రాంచంద్రన్ మాట్లాడుతూ శిక్షణ మరియు నైపుణ్యం కార్యక్రమాలు, గ్రీన్ టగ్‌లు మరియు బోట్ల నిర్మాణ సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి వివిధ కార్యక్రమాల ద్వారా ఓడల నిర్మాణం మరియు మరమ్మత్తు కోసం స్వదేశీ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వ అంకితభావాన్ని నొక్కి చెప్పారు .ఎంఐవి 2030 మరియు ఎంఏకెవి 2047లో నిర్దేశించబడిన లక్ష్యాలను సాధించడానికి భారతదేశాన్ని ఎనేబుల్ చేసే సినర్జీలను ప్రోత్సహించడానికి విలువ గొలుసు అంతటా సహకారం యొక్క ఆవశ్యకతను కూడా ఆయన నొక్కి చెప్పారు.

ఈ వర్క్‌షాప్‌ను 2 సెషన్‌లుగా విభజించారు. ఉదయం సెషన్‌లు షిప్‌బిల్డింగ్‌పై దృష్టి పెట్టాయి మరియు మధ్యాహ్నం సెషన్ షిప్ రిపేర్‌పై జరిగింది. షిప్ బిల్డింగ్ సెషన్‌లు షిప్ బిల్డింగ్ డొమైన్‌లోని ప్రపంచ పోకడల జరిగాయి. తరువాత భారతదేశంలోని ప్రస్తుత షిప్ బిల్డింగ్ మార్కెట్ స్థితి చర్చ జరిగింది. విశిష్ట వక్తలు విశేషమైన ఇన్‌పుట్‌లను అందించారు మరియు షిప్‌బిల్డింగ్‌లో ట్రెండ్‌లు ఉ సవాళ్లు మరియు షిప్పింగ్ రంగంలో గ్రీన్ ఇనిషియేటివ్‌లను తీసుకురావడానికి గల అవకాశాలపై ఇంటరాక్టివ్ చర్చలు జరిగాయి.

ఓడ నిర్మాణంపై దృష్టి సారించి మారిటైమ్ ఇండియా విజన్ 2030 మరియు మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047లో పేర్కొన్న షిప్ బిల్డింగ్ మరియు షిప్ మరమ్మతులకు సంబంధించిన లక్ష్యాలపై నిర్దిష్ట చర్చలు జరిగాయి. భారత ప్రభుత్వం చేపడుతున్న ప్రస్తుత కార్యక్రమాలతో పాటు ప్రపంచ నౌకానిర్మాణ మార్కెట్‌లో భారతదేశం ముందంజ వేయగలదని పేర్కొన్నారు.

14వ ఫిబ్రవరి వర్క్‌షాప్‌లో జరిగిన చర్చల సారాంశంతో మధ్యాహ్నం సెషన్ ప్రారంభమైంది. ఇందులో పాల్గొన్న వారందరికీ ఫైనాన్సింగ్, ఇన్సూరెన్స్ మరియు భారతదేశంలో పిఐఐ క్లబ్ ఆవశ్యకతకు సంబంధించిన కీలకాంశాలు అందించబడ్డాయి.

షిప్ రిపేర్ సెషన్ అధిక ఖర్చులు, విడిభాగాల లభ్యత, కస్టమ్ సంబంధిత సమస్యలు మొదలైన ప్రస్తుత సవాళ్లపై దృష్టి సారించింది. ఓడ మరమ్మతులో భారతదేశం ప్రపంచ అగ్రగామిగా మారడానికి భావి పరిష్కారాల చుట్టూ చర్చలు సాగాయి.

వర్క్‌షాప్ పాల్గొనేవారికి ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడానికి మరియు సహకారం కోసం మార్గాలను అన్వేషించడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందించింది. నెట్‌వర్కింగ్ సెషన్‌లు అర్థవంతమైన పరస్పర చర్యలను సులభతరం చేశాయి మరియు సముద్ర రంగం యొక్క ప్రయోజనాలను పెంపొందించే లక్ష్యంతో భవిష్యత్తులో ఉమ్మడి కార్యక్రమాలకు పునాది వేసింది.

ఈ రంగంలో లోతైన నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ భాగస్వాములు కూడా వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. దక్షిణ కొరియా, బహ్రెయిన్, యుఎఇ మొదలైన బహుళ దేశాల నుండి ప్రతినిధులు వచ్చారు మరియు వివిధ అంతర్జాతీయ పద్ధతులు చర్చించబడ్డాయి.

షిప్‌యార్డ్‌ల కోసం నియమాలు, నియంత్రణ మరియు ప్రాజెక్ట్ పైప్‌లైన్‌పై ప్రభుత్వం నుండి దీర్ఘకాలిక స్పష్టత/దృశ్యత తదనుగుణంగా భవిష్యత్ ఈవెంట్‌లను ప్లాన్ చేస్తుంది. ఇండియా-గల్ఫ్-యూరోప్ కారిడార్ల వంటి అవకాశాలను ప్రతిపాదించారు.

మౌలిక సదుపాయాలను నిర్మించడం, సిబ్బంది/కార్మికుల ఉత్పాదకతను మెరుగుపరచడం మొదలైన వాటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. హరిత పర్యావరణ వ్యవస్థకు పరివర్తన కోసం కార్యక్రమాలు చేపట్టాలి. షిప్ బిల్డర్లు మరియు ఓడ మరమ్మత్తు కోసం డేటాబేస్ సృష్టించాలి.

షిప్పింగ్ కంపెనీలకు మెరుగైన విజిబిలిటీని కలిగి ఉండటానికి ఓఎంసి యొక్క సుదీర్ఘ చార్టింగ్ ఒప్పందాలు పని చేయాలి

ఐఎంయు మరియు సిఈఎంఎస్ వంటి విద్యాసంస్థలు సంబంధిత మరియు ఆచరణాత్మక శిక్షణ నమూనాలను అభివృద్ధి చేయడానికి పరిశ్రమలో పాల్గొనే వారితో సహకరించవచ్చు. టగ్ బోట్‌లు, తీరప్రాంత నౌకలు మొదలైన వాటితో మొదలయ్యే కొన్ని విభాగాల డిజైన్ ప్రామాణీకరణపై ఐఆర్ఎస్ పరిశ్రమతో సహకరించాలి. షిప్ బిల్డింగ్ మరియు షిప్ రిపేర్ డొమైన్‌లలో భారతదేశాన్ని గ్లోబల్ లీడర్‌గా మార్చడానికి భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను చానలైజ్ చేయడంలో వర్క్‌షాప్‌లో జరిగిన చర్చలు ఉపకరిస్తాయి.

# డిసెంబర్ 2023 మాసంలో దేశంలో 5.1% మేర పెరిగిన ఖనిజ ఉత్పత్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:డిసెంబర్, 2023 (ఆధారం: 2011-12=100)లో మైనింగ్ మరియు క్వారీ రంగం యొక్క ఖనిజ ఉత్పత్తి సూచి 139.4 వద్ద నిలిచింది. డిసెంబర్, 2022 నెల స్థాయితో పోలిస్తే ఇది 5.1 శాతం మేర అధికం. ఏప్రిల్-డిసెంబర్, 2023-24 మధ్య కాలానికి సంచిత వృద్ధి అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 8.5 శాతం పెరిగింది. డిసెంబర్, 2023లో ముఖ్యమైన ఖనిజాల ఉత్పత్తి స్థాయి: బొగ్గు 929 లక్షల టన్నులు, లిగ్నైట్ 40 లక్షలు, పెట్రోలియం (ముడి చమురు) 25 లక్షలు, ఇనుప ఖనిజం 255 లక్షలు, సున్నపురాయి ఒక్కొక్కటి 372 లక్షల టన్నులు, సహజ వాయువు (ఉపయోగించబడింది) 3078 మిలియన్ కమ్., బాక్సైట్ 2429 వేల , క్రోమైట్ 235 వేలు, కాపర్ కాంక్ 11 వేలు, లీడ్ కాంక్ 35 వేలు, మాంగనీస్ ధాతువు 319 వేలు, జింక్ కాంక్, 148 వేలు, ఫాస్ఫోరైట్ 117 వేలు, మాగ్నసైట్ ఒక్కొక్కటి 16 వేల టన్నులు, బంగారం 122 కిలోల మేర ఉత్పత్తి చేయడమైంది. డిసెంబర్ 2022తో పోలిస్తే 2023 డిసెంబరులో సానుకూల వృద్ధిని చూపిన ముఖ్యమైన ఖనిజాలు: మాగ్నసైట్ (83.7%), లీడ్ కాంక్.(16.5%), లిగ్నైట్ (14.6%), కాపర్ కాంక్(13.7%), సున్నపురాయి(12.5%), బొగ్గు (10.8%), జింక్ కాంక్.(7.8%), బాక్సైట్ (6.6%), సహజ వాయువు (ఊ) (6.6%), మాంగనీస్ ఓర్ (4.0%) మరియు ఇనుప ఖనిజం (1.3%), మరియు ఇతర ముఖ్యమైన ఖనిజాలు ప్రతికూల వృద్ధిని చూపుతున్నాయి. వీటిలో: పెట్రోలియం(ముడి) (-1.0%), బంగారం (-29.9%), క్రోమైట్ (-30.8%), ఫాస్ఫోరైట్ (-31.2%) మరియు డైమండ్ (-74.4%) తదితరాలు ఉన్నాయి.

# అగ్ని ప్రమాద బాధితులకు బండి పరామర్శ..



కరీంనగర్, ఫిబ్రవరి 23:అగ్ని ప్రమాదంలో గుడిసెల దగ్ధమై సర్వస్వం కోల్పోయిన వడ్డెర బాధిత కుటుంబాలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ శుక్రవారం పరామర్శించారు. దగ్ధమైన గుడిసెలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు సంజయ్ వద్దకు వచ్చి తాము సర్వస్వం కోల్పోయామని వాపోయారు.

కష్టపడి దాచుకున్న బంగారం తోపాటు ఉపాధి కల్పిస్తున్న యంత్రాలను, వాహనాలు సైతం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయని వాపోయారు. తినడానికి తిండి లేని పరిస్థితుల్లో తమకు తాత్కాలిక బసను కల్పించడం తోపాటు భోజన వసతిని మీరే(బండి సంజయ్) కల్పించారని, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి అందించారని పేర్కొన్న బాధితులు మీకు రుణపడి ఉంటామని బండి సంజయ్‌కు చేతులెత్తి నమస్కరించారు. కోల్పోయిన గుడిసెలను మళ్లీ వేసుకోవాలనుకుంటున్నామని, ఆదుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు.

## 'వనపర్తి ఒడిలో ' ఆవిష్కరణ సభ




తేది : 25-2-2024, ఆదివారం
సమయం : మధ్యాహ్నం 3 గంటలకు
వేదిక : వనపర్తి కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో..
ఆవిష్కరణ : ప్రొఫెసర్ జి.హరగోపాల్
పుస్తక పరిచయం : ఎస్.జతిన్ కుమార్
ఆప్త వాక్యం : పాశం యాదగిరి, వనపర్తి, పాలమూరు అధ్యయన వేదిక మిత్రులు, జర్నలిస్టులు
ఆహ్వానం : కెసి వెంకటేశ్వర్లు
అధ్యక్ష వర్గం : కె.వెంకటేశ్వర్లు, ఎండి ఇక్బాల్ పాషా
రచయిత స్పందన : రాఘవ శర్మ
కృతజ్ఞతలు : ఇ.నారాయణ

నిర్వహణ
పాలమూరు అధ్యయన వేదిక

# కరాటే క్రీడాలకు ప్రభుత్వపరంగా సహాయసహకారాలు అందిస్తాం

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్ ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 23:(నేటినిజం ప్రతినిధి): :కరాటే క్రీడాలకు ప్రభుత్వపరంగా కరాటే క్రీడలకు ప్రభుత్వ పరంగా సహకారాలు అందిస్తానని సహాయ సహకారాలు అందిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్ లో . వచ్చే నెల మార్చి3 తేదీన ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్ ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కె వసంత్ కుమార్ లతో కలిసి ఆవిష్కరించారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వపరంగా కరాటే క్రీడకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వేములవాడలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రస్తుత సమాజంలో ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. .పోటీల చీఫ్ ఆర్గనైజర్ అబ్దుల్ మన్నాన్ మాట్లాడుతూ ఈ పోటీలకు సుమారు 600, 800 మంది క్రీడాకారులు మరియు 60 మంది ఆఫీసియల్స్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సీనియర్ కరాటే మాస్టర్లు కూరగాయల శ్రీనివాస్, దండు గల తిరుపతి, లో లోపు రాజు , మానుపాటి తిరుపతి, క స రాజశేఖర్ రెడ్డి కనికరపు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు ,తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రూ.3 లక్షల విలువైన విస్తరాకుల విరాళం..!



శ్రీకాకుళం, ఫిబ్రవరి 23:మార్చి ఒకటో తేదీ నుంచి 11 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్నప్రసాద వితరణ విభాగానికి చీరాల భ్రమరాంబికా సేవా సమితి వారు శుక్రవారం లక్ష విస్తరాకులు విరాళంగా అందజేశారు. అన్నపూర్ణ భవన్ లో దేవస్థానం ఈఓ డి పెద్దిరాజుకు ఈ విస్తరాకులను అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ విస్తరాకులు సమర్పించామని తెలిపారు. వీటి విలువ రూ.3 లక్షల పై చిలుకు ఉంటుందన్నారు. కొన్నేండ్లుగా వీరు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విస్తరాకులు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబికా సేవా సమితి అధ్యక్షురాలు ఎంవీ మహాలక్ష్మి, సేవా సమితి ప్రతినిధులు, శ్రీశైల దేవస్థానం అన్న ప్రసాద వితరణ విభాగం సహాయ కార్య నిర్వహణాధికారి ఎం ఫణిధర ప్రసాద్, పర్యవేక్షకులు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్న ప్రసాద వితరణ ఏర్పాట్ల పరిశీలన

ఒకటో తేదీ నుంచి 11 వరకూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నది. ఇందులో భాగంగానే దేవస్థానం ఈఓ డీ పెద్దిరాజు శుక్రవారం అన్న ప్రసాద వితరణ భవనాన్ని పరిశీలించారు. అన్నదాన భవనంలోని అన్నదాన ప్రదేశాలు, భక్తులు వేచి చూసే గదులు, వంట శాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులతో ఈఓ పెద్ది రాజు మాట్లాడి, అన్న ప్రసాద వితరణపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. దేవస్థానం అందిస్తున్న అన్న ప్రసాదాల పట్ల భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తుండాలని సూచించారు.

సాధారణ భక్తులు, శివదీక్షా స్వాములు, ఉత్సవాల్లో ప్రత్యేక విధుల నిర్వహణకు వచ్చిన సిబ్బంది, ధార్మిక సంస్కృతి కార్యక్రమాలకు వచ్చే కళాకారులకు లోటుపాట్లు లేకుండా అన్న ప్రసాద వితరణ అందజేయాలని సిబ్బందిని ఈఓ పెద్దిరాజు ఆదేశించారు. భక్తులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలన్నారు. ఉత్సవాల సమయంలో క్షేత్ర పరిధిలో పలు చోట్ల స్వచ్ఛంద సేవాకర్తలు కూడా అన్నదానం చేస్తున్నారన్నారు. అటువంటి సంస్థలకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. అన్న ప్రసాద భవనాన్ని, వంటశాలను తరుచుగా శుభ్రపరుస్తూ శుచీ శుభ్రతలను పాటిస్తుండాలని సూచించారు.

# ఛత్తీస్‌గఢ్‌లోని 'సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్'కు చెందిన మొదటి మైలు అనుసంధాన ప్రాజెక్టులు ప్రారంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు స్థిరమైన వృద్ధి కొనసాగించడంలో భారత ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మూడు కీలక ప్రాజెక్టులను రేపు ప్రారంభించనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని 'సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్'కు (ఎస్ఈసీఎల్) చెందిన మూడు ప్రధాన 'మొదటి మైలు అనుసంధాన ప్రాజెక్టు'లను వర్చువల్ పద్ధతిలో శ్రీ మోదీ ప్రారంభిస్తారు. బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ ఇండియా అనుబంధ సంస్థగా ఎస్ఈసీఎల్ పని చేస్తుంది. మొత్తం రూ.600 కోట్ల విలువైన ఈ మూడు ప్రాజెక్టులు బొగ్గును వేగంగా, పర్యావరణ అనుకూలంగా, సమర్థవంతంగా తరలించడంలో కీలకంగా వ్యవహరిస్తాయి.

ఎస్ఈసీఎల్ దీప్క ప్రాంతంలో ఉన్న దీప్క ఓసీపీ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటును రూ.211 కోట్లకు పైగా ఖర్చుతో నిర్మించారు. దీని వార్షిక బొగ్గు నిర్వహణ సామర్థ్యం 25 మిలియన్ టన్నులు. ఈ ప్రాజెక్టులో 20,000 టన్నుల బొగ్గును నిల్వ చేయవచ్చు. 2.1 కి.మీ. పొడవైన కన్వేయర్ బెల్ట్ కూడా ఉంది. దీని ద్వారా గంటకు 4,500-8,500 టన్నుల బొగ్గును వేగంగా లోడ్ చేయవచ్చు. తద్వారా, పిట్ నుంచి రైల్ స్టేషన్ వరకు రహదారి మార్గంలో బొగ్గు తరలింపు ఆగిపోతుంది. ఫలితంగా కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. ఇది పర్యావరణానికి ప్రయోజనమే గాక, రేక్ లోడింగ్ సమయాన్ని గంటకు పైగా తగ్గిస్తుంది, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచుతుంది.

ఎస్ఈసీఎల్ రాయ్‌గఢ్ ప్రాంతంలోని ఛల్ ఓసీపీ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటును రూ.173 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించారు. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గును ఇది నిర్వహించగలదు. బొగ్గు నిల్వ ప్రాంతం, 1.7. కి.మీ. పొడవైన కన్వేయర్ బెల్ట్, 3,000 టన్నుల సామర్థ్యమున్న సిలో ఈ ప్రాజెక్టులో ఉన్నాయి.

ఎన్ఈసీఎల్ రాయ్‌గఢ్ ప్రాంతంలోని బరౌడ్ ఓసీపీ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటును రూ.216 కోట్ల వ్యయంతో పూర్తి చేశారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గును ఇక్కడ నిర్వహించవచ్చు. 20,000 టన్నుల నిల్వ ప్రాంతం ఉంది. 1.7 కి.మీ. కన్వేయర్ బెల్ట్‌ను అమర్చారు. ఈ ప్రాజెక్టులోని వేగవంతమైన లోడింగ్ వ్యవస్థ గంటకు 5000-7500 టన్నుల బొగ్గును లోడ్ చేయగలదు.

పీఎం గతిశక్తి జాతీయ బృహత్తర ప్రణాళికకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులు బహుళ విధ రవాణాను అందిస్తాయి, దేశవ్యాప్తంగా బొగ్గు మౌలిక సదుపాయాలు నిర్మించే నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తాయి. స్థానికంగా ఉపాధి అవకాశాలను సృష్టించడం, బొగ్గు సరఫరాలో సమర్థత ద్వారా ఈ ప్రాజెక్టులు సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి.పర్యావరణ సుస్థిరతకు అనుగుణ ంగా ఉండే ఈ మొదటి మైలు అనుసంధాన (ఎఫ్ఎంసీ) ప్రాజెక్టులు, రహదారి మార్గంలో బొగ్గు రవాణాపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. తద్వారా వాహన రద్దీ, రోడ్డు ప్రమాదాలు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం తగ్గుతాయి.

# న్యూఢిల్లీలో సమావేశమైన సందర్భంగా ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడంపై చర్చించిన రక్షణమంత్రి ఒ నెదర్లాండ్స్ రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నెదర్లాండ్స్ రక్షణ మంత్రి మిస్ కజ్సా ఒల్లొంగ్రెన్‌తో ఫిబ్రవరి 23, 2024న న్యూఢిల్లీలో ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు.

ముఖ్యంగా సముద్రతీర, పారిశ్రామిక రంగాలలో ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని విస్తరింప చేసుకునే అవకాశాలపై మంత్రులిద్దరూ చర్చించారు. ఇరు నావికాదళాల మధ్య పెరిగిన పరస్పర్ చర్యను గుర్తిస్తూ, హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర భద్రతను పెంచేందుకు కలిసి పని చేసేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారు.

తమ సరఫరా లంకెలలోకి భారతీయ విక్రయదారులను కలుపుకోవడాన్ని డచ్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులను ప్రోత్సహించవచ్చని రక్షణమంత్రి సూచించారు. భారత్ సజీవమైన ఆవిష్కరణను, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసింది. సాంకేతికతలు, నైపుణ్యాల, పరిమాణంలో భారత్, డచ్ పరిపూరకత నేపథ్యంలో రక్షణ పరిశ్రమలు, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాలలో మరింత పరస్పర చర్యను ప్రోత్సహించేందుకు ఇరు పక్షాలూ అంగీకరించాయి.

నెదర్లాండ్స్ రక్షణ మంత్రి న్యూఢిల్లీలోని రెయిజీనా డైలాగ్‌లో పాలుపంచుకుంటున్నారు.

న్యూఢిల్లీలో సమావేశమైన సందర్భంగా ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడంపై చర్చించిన రక్షణమంత్రి ఒ నెదర్లాండ్స్ రక్షణ మంత్రి

హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర భద్రతను పెంచేందుకు కలిసి పని చేయనున్న రెండు దేశాలు

భారతీయ విక్రయదారులను తమ సరఫరా లంకెలో కలుపుకునేలా డచ్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులను ప్రోత్సహించవచ్చు : శ్రీ రాజ్‌నాథ్ సింగ్

కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నెదర్లాండ్స్ రక్షణ మంత్రి మిస్ కజ్సా ఒల్లొంగ్రెన్‌తో ఫిబ్రవరి 23, 2024న న్యూఢిల్లీలో ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు.

ముఖ్యంగా సముద్రతీర, పారిశ్రామిక రంగాలలో ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని విస్తరింప చేసుకునే అవకాశాలపై మంత్రులిద్దరూ చర్చించారు. ఇరు నావికాదళాల మధ్య పెరిగిన పరస్పర్ చర్యను గుర్తిస్తూ, హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర భద్రతను పెంచేందుకు కలిసి పని చేసేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారు.

తమ సరఫరా లంకెలలోకి భారతీయ విక్రయదారులను కలుపుకోవడాన్ని డచ్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులను ప్రోత్సహించవచ్చని రక్షణమంత్రి సూచించారు. భారత్ సజీవమైన ఆవిష్కరణను, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసింది. సాంకేతికతలు, నైపుణ్యాల, పరిమాణంలో భారత్, డచ్ పరిపూరకత నేపథ్యంలో రక్షణ పరిశ్రమలు, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాలలో మరింత పరస్పర చర్యను ప్రోత్సహించేందుకు ఇరు పక్షాలూ అంగీకరించాయి.

నెదర్లాండ్స్ రక్షణ మంత్రి న్యూఢిల్లీలోని రెయిజీనా డైలాగ్‌లో పాలుపంచుకుంటున్నారు.

# రాహుల్ గాంధీ జన్మలో ప్రధాని కాలేడు : కిషన్ రెడ్డి

కుమ్రం భీం ఆసిఫాబాద్/తాండూర్ : రాహుల్ గాంధీ జన్మలో ప్రధాన మంత్రి కాలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన బీజేపీ విజయ్ సంకల్ప్ యాత్రలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఇప్పుడు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ని గెలిపిస్తేనే హామీలు అమలు చేస్తామనే విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ యత్నిస్తుందని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారంటీల అమలుకు నిధులనెలా సమకూర్చుకుంటారో బయట పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

దేశ ప్రజలందరూ నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు సైతం మోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 400లకు పైగా సీట్లను గెలుస్తుందని.. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ఎన్నిక అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

# ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## -జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 23: జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు




పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యాధికారి, పరీక్షల నిర్వహణ కన్వీనర్ రఘురాజ్ అన్నారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు కీలకమని పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర(ఖిల్లా) జూనియర్ కళాశాలలో సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు పరీక్షల నిర్వహణపై గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో ఏమరుపాటు లేకుండా చాకచక్యంగా వ్యవహరించాలని సూచించారు.

పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పరీక్షల నిర్వహణ కమిటీని సంప్రదించాలని సూచించారు. పరీక్షలను పక్కాగా నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మూత్రశాలలు, ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్ల నుంచి తీసుకవచ్చిన తర్వాత సీసీ కెమెరాల ముందు మాత్రమే ఓపెన్ చేయాలన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు.

ప్రతి విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. 9 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించరాదని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144వ సెక్షన్ విధించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, రజీయొద్దీన్ అస్లాం, దేవారాం, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ యకీనుద్దీన్, హైపవర్ కమిటీ ప్రతినిధి చిరంజీవి, అధికారి చిన్నయ్య, ప్రభుత్వ అధ్యాపకుల సంఘాల నాయకులు నర్సయ్య, లక్ష్మీనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

# గాంధీ దవాఖానలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 23:గాంధీ దవాఖానలో డ్రైనేజీ లీకేజీ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించిన సందర్భంగా శుక్రవారం ఆయన సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానాకు వచ్చారు.

అదే సమయంలో భవనంపై నుంచి డ్రైనేజీ లీకేజీలను గమనించారు. దానిపై గాంధీ దవాఖాన సూపరిం టెండెంట్ డాక్టర్ ఎం.రాజారావుతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గాంధీ దవాఖాన నిర్మించి 20 ఏండ్లు పూర్తి అయ్యిందని, పాత పైపులైన్లు శిథిలావస్థకు చేరాయని అన్నారు. గత ప్రభుత్వం ఇందుకోసం రూ.14.80 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. టెండర్లను ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు మొదలుకాలేదని తెలిపారు. ఈ లోగా ఎన్నికలు రావడంతో కొంత జాప్యం నెలకొన్నదన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి, ఇంజినీరింగ్ విభాగం అధికారులను పంపించి డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నివారణ చర్యలు తీసుకుంటామన్నారు.

# హామీలను మరిచిన మోదీ ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 23: మోదీ ప్రభుత్వం మాటలే తప్ప హామీలను అమలుచేయకుండా.. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నదని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో వారం రోజుల్లో మరో రెండు పథకాలను అమలుచేస్తామని చెప్పారు. మండలంలోని కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి గ్రామాల్లో అధికారులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కూనేపల్లిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వారం రోజుల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్, తెల్లరేషన్ కార్డుదారులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలుచేసి ప్రజల రుణం తీర్చుకుంటామని పేర్కొన్నారు.

వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షల్లో 75 శాతం కన్నా తక్కువ ఫలితాలు సాధిస్తే అందుకు పూర్తి బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి రూ. కోటిన్నరతో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు స్వస్తిపలికి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. కళ్యాపూర్ గ్రామంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులకే అందజేయాలని అధికారులను ఆదేశించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మోబిన్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

# 'దంగల్' నటి మృతి.. ఇంటికి వెళ్లి పరామర్శించిన అమీర్ ఖాన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్ నటించిన 'దంగల్' చిత్రంలోని బాలనటి సుహానీ భట్నాగర్(19) ఇటీవల కన్నుమూసిన విషయం తెలిసిందే. కొన్ని రోజుల క్రితం కాలికి గాయమవ్వడంతో దిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స తీసుకున్నారు సుహానీ.

అయితే ట్రీట్‌మెంట్‌లో భాగంగా వాడిన మందులు రియాక్షన్ వల్ల సైడ్‌ఎఫెక్ట్ వచ్చి చికిత్స పొందుతూ గత శనివారం ప్రాణాలు విడిచింది. ఇక సుహానీ మరణ వార్తతో చిత్ర పరిశ్రమలో విషాద చాయలు అలముకున్నాయి. పలువురు నటులు సోషల్ మీడియా ద్వారా సుహానీ మృతికి సంతాపం తెలిపారు.

ఇదిలావుంటే సుహానీ మరణవార్త విన్న అమీర్ ఖాన్ సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించిన విషయం తెలిసిందే.

తాజాగా ఫరీదాబాద్‌లోని ఆమె ఇంటికి వెళ్లిన అమీర్ ఖాన్ సుహానీ చిత్రపటానికి నివాళులు అర్పించాడు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# కర్నూలు జిల్లాలో వైసీపీకు భారీ షాక్

కర్నూలు ఫిబ్రవరి 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార వైసీపీ కి భారీ షాకులు తగులుతున్నాయి. ఫ్యాన్ పార్టీలో అసంతృప్తితో ఉన్న నేతలంతా వైసీపీను వీడి టీడీపీ లో చేరారు. దాంతో ఓర్వకల్లులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన 200 వైసీపీ కుటుంబాలు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు.పసుపు కండువా కప్పి టీడీపీలోకి మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, గౌరు వెంకట రెడ్డి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడుతామని ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలు హెచ్చరించారు. జగన్ పార్టీలో సముచిత స్థానం లేకపోవడంతోనే ఆ పార్టీని వీడామని వారు స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ – జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని.. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారికి ప్రాధాన్యం కల్పిస్తామని గౌరు చరితారెడ్డి తెలిపారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.